


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**120**

**(5' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

'**సంఘంలో** సంచరించడం చాలా కష్టంగా ఉందండీ ఎవర్ని పలకరించాలో, ఎవర్ని మానాలో తెలియడం లేదు. ఎవరెందుకు ఫోజులు పెడుతున్నాడో అంతకన్నా అర్థం కావడంలేదు" అన్నాడు మొన్న ఒక మిత్రుడు.

"ఇప్పుడేమిటండి సంఘం సంగతి ఎప్పుడూ ఇంతే. ఈ యుగంలో మరి సంఘం సాఫీగా ఉంటుందా? ప్రతి హృదయం, చటుక్కున చతికిల పడటానికి కుషన్ సోఫాలాగా ఉంటుందా? బయట అలా కనిపిస్తే మాత్రం కూర్చోడానికి వీలా? కూర్చోటమంటూ వస్తే దానికంటే ఊరు బయట రాతి వంతెనే నయం" అన్నాను.

"అబ్బే చాలా కష్టంగా ఉందండి. వ్యక్తుల్ని, మనస్సుల్ని కనిపెట్టడం. మనుష్యులమైన తర్వాత మరొకళ్ళయితే నిమిత్తం లేకుండా ఎలా ఉంటాము?" అని ఆయన నైరాశ్యం వెలిబుచ్చాడు.

"ఇది నిత్య నైరాశ్యమేనండి. దీనికి ఎక్కువగా ఆలోచించవలసిన పనిలేదు. జన్మకు ఒకసారో రెండుసార్లో ఏర్పడే నిరాశను గురించి ఆలోచించాలి. నిత్య నైరాశ్యానికి మనం విషాద యోగం ఎక్కడ పూనుకోగలం?" అన్నాను.

"అరరే! రాత్రి గొర్రెలనుకొన్నవి తెల్లారేసరికి తోడేళ్ళయిపోతున్నాయి. సన్నటి పిల్లి ఇవ్వాళ పులి అయిపోతోంది. క్రిందటి వారంలో పకీరు కేకలు పెట్టిన వాడీవారం పాదుషాలాగా హూంకరిస్తున్నాడు. ఏమి సోద్యం?" అన్నారాయన.

"పెట్టనియ్యండి. మనం వేటిజోలికీ పోకుండా మన త్రోవను మనం నడుస్తుంటే - వాటి త్రోవన అవి తప్పుకుంటాయి. అంతకన్నా మనం చేసేదికూడా ఏమీలేదు" అన్నాను. ఆయన చప్పరిస్తూ అక్కడనుంచి నిష్క్రమించారు. ఆయన చెప్పినదాంట్లో ఎంతో అర్థం వుంది. సంఘంలో గంగిగోవువంటి వారు లేకపోలేదు. వారి ఎడసు కూడా సరిగ్గా ఎవరికీ తెలియదు. వారిలో వుండే ధర్మగుణాన్ని వర్ణించేవారు కనిపించరెక్కడ. పోతే జిత్తులమారులకు కావలసినంత పలుకుబడీ, ప్రాభవం ఏర్పడుతోంది సంఘంలో. పైగా ఎవరన్నా ఆపుకోలేక "వాడు వట్టి టక్కరి అంటే కొంచెం జాగ్రత్తగా వుంటే మంచిది" అని సలహా చెపితే.

"మీరు చాలా పొరబడుతున్నారు. అతడెలాటి వాడైనా కానివ్వండి మొత్తం మీద కార్యశూరుడు. అతనివల్ల చాలా ప్రయోజనాన్ని పొందవచ్చు" అంటూ సమర్థిస్తారు గానీ, క్షణం ఆగి ఆలోచించడానికి కూడా ఇష్టపడటంలేదు. జిత్తులమారులకు వున్న తొత్తుల సంఖ్య అధికం ఈ మత్తు కాలంలో.

'ఈ ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని ఒక చోట బోర్డు వ్రాసి కట్టబడి వుందిట. మర్నాడు ఉదయం చూసేసరికి ఆ అక్షరాల క్రింద ఎర్రటి అక్షరాలతో "అందరికీ కాదు ఆడంబరులకు. ఆరంభశూరులకూ మాత్రం" అని వ్రాసివుంది. "వనంలో ఎన్ని రకాల మృగాలుంటాయో, సంఘంలో అంతకు మించిన విచిత్ర జంతువులుంటాయి. వాటిని వేరు చేయడం పేరు పెట్టడం సాధ్యంకాని పని గనుక అలా వదిలివేయడం జరిగింది" అక్బరెడోజీస్ అనే ఆయన వర్ణించాడు. ఈయన వర్ణనలో కొంత వరకైనా సత్యం లేకపోలేదు.

పైగా వనంలో వుండే జంతువులు పుట్టిన రూపంలోనే పెరుగుతాయి. సంఘంలో అలాకాదు. పైకి అన్నీ ఒకటే. లోపల లక్షణాలే తెలియకుండా దూకుతుంటాయి - అదే వచ్చిన చిక్కు అంటారు.

ఇలాటి నరులు వారి స్వరూపాలు వారు స్వయంగా చిత్రించుకుంటే ఎంతో మంచిది. కానీ అలా చేయడానికి ఎవరు అంగీకరిస్తారు. "మా అత్త పెద్దపులి" అని కోడలంటుంది.

"మా కోడలు కొండముచ్చు" అని అత్త అంటుంది. నిజానికి ఎవరి లక్షణాలు వారికి తెలియవేమో? తెలిసినా వాటిని వెలిబుచ్చుకోవడం అంత బావుండదేమో? ఎదుటి వాళ్ళు అంటున్నప్పుడు అందులో వున్న సొగసు బయటపడుతుంది.

పూర్వకాలంలో కొందరు ఏవో తప్పులు చేసి పశ్చాత్తాపంలో మునిగి తర్వాత "నేను పాపిని! మహా పాపిని! నన్నెవరూ పలకరించవద్దు. దగ్గరకు రావద్దు" అని గొడవచెయ్యడం కద్దు. ఇప్పుడు పాపాలు చెయ్యడం 'బర్త్ రైట్' పశ్చాత్తాపం చెందడం పైశాచక ప్రవృత్తి క్రింద మారిపోయాయి.

పాపం చేసిన వాడు ఎంతో హాపీగా ఉంటున్నాడు. ధర్మంకోసం పోయిన వాడు బుర్రలో బర్మామేకు దిగిపోయినట్లు గ్రుడ్లు బయటపెట్టుకుని కూర్చుంటున్నాడు. పైకి కనిపించే ఇలాటి లక్షణాల్ని బట్టే మనం కొంతవరకు వారి గుణాల్ని కనిపెట్టడం సాధ్యం అవుతుంది. అంతేగాని పైకి కనిపించే రూపాలను బట్టికాదు. ఇంట్లో ఆ పూట కూడా తండులాలు లేనివాడు, దాదాపు త్రాగుడు పోషణకోసం జోలికట్టుకుని బయలుదేరవలసిన సమయంలో ఏ మిత్రుడింటివద్దో, లేకపోతే మిత్ర సహాయంతో ఏ కాఫీ హోటల్‌లోనో ఇంత కాఫీ త్రాగి ఇల్లు మర్చిపోయి జాలీగా కబుర్లు చెపుతుంటే అతణ్ణి చూసి "పాపి" అనుకోవడానికి ఆస్కారమెక్కడుంది? పైగా అతగాడు మాటలతో మనల్ని అయస్కాంతం ఇనప మేకుల్ని బయటికి లాగినట్లు లాగి మన బుర్రలో "నట్లు"న్నీ ఊడదీసి ఒక ప్రక్క ప్రోగు పెట్టి మిగిలిన బుర్రను బుడబుక్కలవాడి గిలక్కాయలాగా వాయించి చక్కా పోతాడు. అతడు మేధావి కాదనే వారెవరుంటారు?

కొందరు వచ్చి తనకు తోచిన విషయం మీద అంతా ముంచుకుపోతున్నట్లు భూమి కుచించుకుపోతున్నట్లు భారతదేశానికీ, ప్రత్యేకించి తనకూ ఏదో వంచన జరుగుతున్నట్లు కాసేపు గంభీరోపన్యాసం చేసి అంతలో దార్ఢ్యంలోకి దిగజారి పొగచూరిన పళ్ళెంలాగా ముఖాన్ని మార్చుకుని కూర్చుంటూ వుంటారు.

ఇంతకీ అతగాడు వేదన పడుతున్న విషయానికీ, అతనికీ ఏమీ సంబంధం కనిపించదు. గట్టిగా అడిగితే "వాక్స్వాతంత్రమంటాడ"నే భయంతో ఊరుకోవడం జరుగుతూ వుంటుంది.

కొంచెం కలసివచ్చిన మిత్రుడొకడున్నాడు అనుకోకుండా సిరి వాడియింటి తులసి చెట్టుకు వెన్నులాగా విరబూసింది. దాని వర్ణన తప్ప, మరొకటి వుండదు. అతడు వినిపిస్తే అందరూ వచ్చి అతడి చేతిలో డబ్బుపెట్టి పోవాలి. కానీ అతగాడు అంటాడు" ఇంకోడి చేతిలో రూపాయి పెట్టడం కన్నా పాపంలేదనుకో. ఇహ గంగలోపారేసినట్లే పాడు మొఖాలు చారెడు నీళ్ళు నిలిస్తే చారెడు మొసళ్ళు వచ్చి చేరతాయి" అని.

ఎవరైనా ఒక పిల్లలగల గృహస్థు సొరకాయ కొనుక్కుపోతున్నా చూచి సహించలేడు "వాడికి తలకాయ లేదు వాడికి వచ్చే జీతంలో సొరకాయ ఎక్కడ కొంటాడు? కొన్నాళ్ళకు సోదిలోకి రాకుండా పోతాడు" అని దీవిస్తాడు.

ఇంట్లో సంగతి మరీ విచిత్రం అణా బల్లమీద పెట్టి, అందరి చేతా ప్రదక్షిణలు చేయిస్తాడు" ధనం ఒక్కటేకాదు మానవుడు పొందతగిన ఔన్నత్యం ఎంతో వుంది. విజ్ఞానం, భక్తి త్యాగం, సేవ అని చెపుతుంటే "ఆపెయ్యి ఆపెయ్యి అంతకన్నా త్యాగం వుంటే జేబులో పర్సు ఇక్కడ పెట్టి పో. దాంట్లో ఎంతవున్నా సరే మేడ దిగి మూడడుగులు వేసేసరికి మూర్ఛపోకపోతే చూస్తా"నంటాడు.

కుటుంబ సభ్యులందరూ కులుకుతూ ఆయన చుట్టూ తిరుగుతారు. అతడు సంస్కారం అనేమాట ఒక సందర్భంలోనే ఉపయోగిస్తూ ఉంటాడు అవి కేస సంస్కార సందర్భంలో.. ఆ "సంస్కారానికి అర్ధరూపాయి" అని పద్దు వ్రాసుకోవడం అలవాటైందట.

Post your comments